


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :178 | మంగళవారం 01 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 | ఫోన్ : 9441877695



# కెమికల్ ఫ్యాక్టరీలో.. భారీ పేలుడు

- సిగాచి ప్రమాదంలో 12 మంది మృతి
- సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ఘటన
- పేలుడు ధాటికి కుప్పకూలిన భవనాలు
- 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డ కార్మికులు
- చుట్టూ ఉన్న భవనాలకు అంటుకున్న మంటలు

**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు లో పాశమైలారంలోని సీగాచి కెమికల్స్ పరిశ్రమ లో రియాక్టర్ పేలిన ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటివరకు 14 మంది చనిపోగా.. మరో 35 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. కాగా ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో మరో12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

**వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం**

ఈ ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవాన్ కూడా దుర్మరణం పాలయ్యారు. గోవన్ ఉదయం ప్లాంటులోకి వచ్చిన సమయంలోనే భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి సమీపంలోని ఆయన కారు నుజ్జునుజ్జు అయింది. పేలుడు ధాటికి కార్మికులు 100 మీటర్ల దూరం ఎగిరి పడ్డారు. రియాక్టర్ ఛాంబర్ భవనం కుప్పకూలగా.. మరో భవనం బీటలు వారింది. ప్రమాద స్థలిలో కార్మికుల మృతదేహాలు గుర్తు పట్టలేనంత చెల్లాచెదురయ్యాయి.

# తెలంగాణలో గుడిసెలు లేకుండా చేస్తాం

- ఇందిరమ్మ ఇండ్లతో నిరుపేదల కలలు నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- ఒక్కో ఇంటికి ఉచితంగా 40 మెట్రిక్ టన్నుల ఇసుక
- 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం
- పట్టణాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయండి - మంత్రి పొంగులేటి



**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** నిరుపేదలకు గృహ వసతి కల్పించడంలో భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రం తలమానికంగా నిలిచేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వంకూడా 5 లక్షల రూపాయిలతో ఇండ్లను నిర్మించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇండ్లతో సంబంధం లేకుండా రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు.

# టారిఫ్స్ పొడిగించే ఆలోచనలేదన్న ట్రంప్..

## కొనసాగుతున్న భారత చర్చలు..



**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్ని నెలల కిందట ప్రపంచ దేశాలపై ప్రకటించిన ట్రేడ్ టారిఫ్స్ వ్యాపారాలతో పాటు ఆర్థిక వ్యవస్థలను అతలా కుతలం చేసిన సంగతి తెలిసిందే. అయితే వీటి అమలుకు 90 రోజులు బ్రేక్ ప్రకటించిన ట్రంప్ స్వల్ప ఊరటం ఇచ్చారు. అయితే ఈ గడువు జూలై 9న ముగుస్తుండటంతో మరోసారి గడువును పొడిగించే ఆలోచన తనకు లేదని ప్రెసిడెంట్ ట్రంప్ చెప్పటం కొంత ఆందోళలను పెంచుతోంది.

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు

- రాజకీయ నాటకీయాల మధ్య రామచందర్ రావుకు బీజేపీ పట్టం
- రామచందర్ రావు ఎంపిక ముందే ఖరారు - హైకమాండ్ స్క్రిప్ట్ ప్రకారమే ఎన్నిక
- ఈటల, అర్వింద్ రేసు నుంచి తొలిగిపోవడంతో రామచందర్ రావు అగ్రభాగంలోకి
- నేడు అధికారిక ప్రకటన: బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు పేరును హైకమాండ్ ప్రకటించనుంది
- 'మీకో దండం – మీ పార్టీకో దండం': రాజాసింగ్ నిష్క్రమణ వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్




# కేంద్రమంత్రి అమిత్ షాపై టీపీసీసీ చీఫ్ ఫైర్

**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు.



# గ్రూప్ 1 పిటిషన్లపై హైకోర్టులో విచారణ

**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ హైకోర్టు లో నేడు గ్రూప్ 1 పిటిషన్లపై విచారణ జరిగింది. TGPSC నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష సమాధాన పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై నేడు విచారణ జరగగా.. ఈ విచారణ రేపు కూడా కొనసాగనుంది.



# బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు నిరాకరణ

- బనకచర్ల ప్రాజెక్ట్‌కి పర్యావరణ అనుమతులకు నో
- తెలంగాణ ఆక్షేపణల నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్ట్ ప్రతిపాదనను తిరస్కరించిన కేంద్రం
- గోదావరి ట్రిబ్యూనల్ తీర్పు ప్రకారం ప్రాజెక్ట్ అభ్యంతరకరమని కేంద్ర నిపుణుల కమిటీ అభిప్రాయం
- బనకచర్లకు అనుమతి కావాలంటే సీడబ్ల్యూసీ క్లియరెన్స్ తప్పనిసరి: కేంద్ర సూచన
- బనకచర్లపై విస్తృత ఫిర్యాదులు.. పర్యావరణ అనుమతులు నిలిపిన కేంద్రం



**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్‌కు తేల్చిచెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిప్పిపంపింది.

# వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు..?

- పాశమైలారం అగ్ని ప్రమాదంపై హరీశ్ రావు ఆగ్రహం
- అగ్ని ప్రమాద బాధితులకు కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి
- "ఎన్‌డీఆర్ఎఫ్ అద్భుతం, కానీ ప్రభుత్వం ఫెయిల్" - హరీశ్ రావు



**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాద ప్రదేశాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఇతర నాయకులతో కలిసి మాజీ మంత్రి హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో మాట్లాడి.. అక్కడ అందిస్తున్న సహాయక చర్యల గురించి తెలుసుకున్నారు..

# ఊరుకునే ప్రసక్తే లేదు

- హైడ్రా కూల్చివేతలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్
- బంజారా హిల్స్‌లో కోట్ల విలువైన భూములపై కాంగ్రెస్ నేతల కబ్జా ఆరోపణలు
- జీవో 58, 59 లతో ధనవంతుల కబ్జాలకు ముద్ర వేస్తున్నారు
- హైడ్రా కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీయడంతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జోక్యం
- పేదల జీవితం తాకట్టు పెట్టొద్దు
- మాదాపూర్ సున్నం చెరువులో హైడ్రా ఆపరేషన్‌పై తీవ్రంగా స్పందించిన స్థానికులు, ప్రజాప్రతినిధులు



**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. హైడ్రా కూల్చివేతలపై ఇదివరకే ఘాటు వ్యాఖ్యలు చేసిన ఆయన.. మరోసారి సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇళ్ల కూల్చివేతలను టార్గెట్ చేస్తూ కూల్చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం జవహర్ నగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. పేదల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించారు. '30, 60 గజాల్లో ఇళ్లు కట్టుకునేవాడు పేదవాడా? ధనవంతుడా? మూర్ఖులారా..' అని ధ్వజమెత్తారు.

# మీకో దండం.. మీ పార్టీకో దండం

## బీజేపీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్..

**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక ఆ పార్టీలో కల్లోలం సృష్టిస్తున్నది. పదవి కోసం పోటీపడి భంగపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన రాజీనామాను ఆమోదించాలని కిషన్‌రెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి తనను నామినేషన్ వెయ్యనివ్వలేదని ఆరోపించారు. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి వస్తే.. తన మద్దతుదారులను కొందరు బెదిరించారని, జాతీయ కౌన్సిల్ సభ్యులు మద్దతు ఇవ్వకుండా బెదిరించారనర్నారు. పార్టీలో ఉంటారా? సస్పెండ్ చేయాలా? అని హెచ్చరించారని తెలిపారు. నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయనివ్వలేదన్నారు.



# నక్సలైట్లను చంపగలరేమో.. నక్సలిజాన్ని చంపలేరు : సీపీఐ నారాయణ



**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** నక్సలైట్లతో చర్చలు ఉండవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిజామాబాద్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పందించారు. నక్సలైట్లను చంపగలరేమోగానీ నక్సలిజాన్ని అంతం చేయలేరని అన్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా నక్సలిజాన్ని అంతం చేస్తామన్న అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవాచేశారు.

# కెమికల్ ఫ్యాక్టరీలో.. భారీ పేలుడు

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమ వద్ద ఉద్రిక్తత

సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. రియాక్టర్ పేలడంతో ఇప్పటి వరకు 14 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కాగా ప్రమాదంలో చాలామంది కార్మికుల ఆచూకీ లభించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి. తమవారి ఆచూకీ చెప్పాలంటూ బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పరిశ్రమ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పరిశ్రమలోకి వారిని వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో కార్మికుల కుటుంబాల రోదనలు మిన్నంటుతున్నాయి.

**ప్రముఖులు సంతాపం**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమలో నెలకొన్న ప్రమాదంపై పలువురు స్పందించారు.

**ప్రమాదంపై ప్రధాని మోదీ ట్వీట్**



'తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డిలో ఒక కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాము' అని ప్రధాని మోదీ ప్రకటించారు.

**మెరుగైన వైద్యం అందేలా చూడండి,,,గవర్నర్ ఆదేశం**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటన పట్ల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ ద్వారా ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.

**కేసీఆర్ దిగ్ర్భాంతి**



సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన పేలుడు ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సిగాచి పరిశ్రమలో 14 మంది కార్మికుల మృతిపట్ల సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలని ఆదుకోవాలన్నారు.

**ప్రమాదంపై పవన్ ఆవేదన**



తెలంగాణ రాష్ట్రంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదనకు లోనయ్యాను. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడం మూలంగా చోటు చేసుకున్న ఈ పరిశ్రమలో గాయపడ్డవారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారికీ, ఇతర క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను' అంటూ డిప్యూటీ సీఎం పవన్ ట్వీట్ చేశారు.

# మీకో దండం.. మీ పార్టీకో దండం

**బీజేపీకి రాజీనామా చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్..**

మొదటి పేజీ తరువాయి

నా నామినేషన్ పత్రంపై సంతకం చేసేందుకు పది మంది సిద్ధంగా ఉన్నారని.. కానీ, మద్దతుదారులను నామినేషన్‌పత్రంపై సంతకాలు చేయనివ్వలేదని విమర్శించారు. నా విషయంలో లక్షలాది మంది కార్యకర్తలు బాధపడుతున్నారన్నారు. రామచందర్‌రావుకు అధ్యక్ష పదవి ఇవ్వడంపై కార్యకర్తల్లో అసంతృప్తి ఉందన్నారు. 2014 నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నానన్నారు. బీజేపీ అధ్యక్ష పదవి ఎవరికి ఇవ్వాలో ముందే డిసైడ్ చేశారని, పార్టీ సింబల్‌పై తాను ఎమ్మెల్యేగా గెలిచానని.. రాజీనామా లేఖను సైతం కిషన్‌రెడ్డికి అందించానన్నారు. స్పీకర్‌కు రాజీనామా లేఖను కిషన్‌రెడ్డే పంపించాలన్నారు. పార్టీ కోసం తాను సర్వం ధారపోశానని.. ఉగ్రవాదులకు టార్గెట్‌గా ఉన్నానన్నారు. మీకో దండం.. మీ పార్టీకో దండం అంటూ వ్యాఖ్యానించిన రాజాసింగ్.. ఆ పార్టీకి రాజీనామా చేసిన హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటానన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు బీజేపీ నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

# కేంద్రమంత్రి అమిత్ షాపై టీపీసీసీ చీఫ్ ఫైర్

మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్టుల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్ట్‌ల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసిది' అంటూ ఫైర్ అయ్యారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ఫైర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారం కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

# తెలంగాణలో గుడిసెలు లేకుండా చేస్తాం..

మొదటి పేజీ తరువాయి



పేదవాడికి మరింత చేయూత ఇవ్వాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లపై సోమవారం మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

పేదవారికోసం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా రాష్ట్రంలో గుడిసెలు అనేవి లేకుండా చేయాలన్నదే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్వరాష్ట్రంలో సొంత ఇంటి కోసం నిరుపేదలు కన్న కలలు గత ప్రభుత్వ నిర్వాకం వల్ల కలగానే మిగిలిపోయాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేదలు కన్న కలలను సాకారం చేస్తోందన్నారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున 22,500 కోట్ల రూపాయిలతో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఇప్పటి వరకు 3 లక్షల ఇండ్లను మంజూరు చేశామని ఇందులో 1 లక్షా 23 వేల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లుల కోసం లబ్దిదారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి సోమవారం నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోకే నిధులను జమచేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణంలో కొన్ని జిల్లాల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ కొలిక్కివచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని వీలైనంత త్వరలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# టారిఫ్స్ పొడిగించే ఆలోచనలేదన్న ట్రంప్..

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ట్రంప్ నిర్ణయంతో అమెరికాలో ఉన్న భారత ట్రేడ్ చర్చల బృందం వాషింగ్టన్ నగరంలో తమ పర్యటనను పొడించుకుంటోంది. వీలైనంత త్వరగా చర్చలను ముగించాలని, గడువుకు మునుపే వాటిని కొలిక్కి తీసుకురావాలని వారు ప్రయత్నిస్తున్నారు. వ్యక్తిగతంగా అమెరికా ఇండియా అధికారుల మధ్య జూన్ 27 నుంచి చర్చలు జరిగాయి. ఈ క్రమంలో త్వరలోనే ఈ ప్రక్రియ ముగింపుకు చేరుకోవచ్చని సమాచారం.

ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన అదనపు 26 శాతం పరస్పర సుంకం నుంచి పూర్తి మినహాయింపు అందించాలని ఇప్పటికే ఇండియా కోరుతోంది. సుంకాన్ని 90 రోజుల పాటు నిలిపివేసినప్పటికీ, వాషింగ్టన్ విధించిన 10 శాతం బేస్‌లైన్ సుంకం అమలులోనే ఉంది. జూలై 8 నాటికి చర్చలు ముగియకపోతే, భారతదేశం కొత్త సుంకాల ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ట్రంప్ ఒక ఇంటర్వ్యూలో ట్రేడ్ టారిఫ్స్ అమలు బ్రేక్ పొడిగించే ఆలోచన తనకు లేదనటం ఆందోళనలు పెంచుతోంది. అలా చేయాల్సిన అవసరం లేదని తాను అనుకుంటున్నట్లు చెప్పారు.

రాబోయే సుంకాల గురించి దేశాలకు తెలియజేసే లేఖలు "త్వరలో" ప్రారంభం అవుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే మరో పక్క భారతదేశ వ్యవసాయ మార్కెట్‌ను జన్యుపరంగా మార్పు చేసిన పంటలకు అనుమతివ్వాలన్న వాషింగ్టన్ ఒత్తిడితో సహా కీలకమైన అమెరికా డిమాండ్లను భారతదేశం వ్యతిరేకిస్తూనే ఉంది. రైతులు నష్టాల్లో ఉన్నట్లు భారత్ వాదిస్తోంది. అయితే వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఇంధనం వంటి రంగాలను తెరవాలని, సోయా, గోధుమ, మొక్కజొన్న, ఇథనాల్, ఆపిల్ వంటి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని అమెరికా భారతదేశాన్ని కోరుతోంది. ఇదే సమయంలో భారత్ టెక్స్ టైల్, ఫార్మా, ఇంజనీరింగ్ వంటి రంగాల్లో జీరో డ్యూటీలను డిమాండ్ చేస్తోంది.

# బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు నిరాకరణ

మొదటి పేజీ తరువాయి

బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ కు సూచించింది.

కాగా, ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి చాలా ఫిర్యాదులు అందాయి. ఈ ప్రాజెక్టును మొదటి నుంచి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వెంటనే ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్రానికి ఫిర్యాదులు చేసింది. ఈ క్రమంలో బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఏపీ పంపిన ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది.

బనకచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కమిటీ.. అనుమతులు ఇవ్వడానికి తిరస్కరించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే గోదావరి ట్రిబ్యూనల్ తీర్పు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్ట్ గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమంటూ అనేక ఫిర్యాదులు వచ్చాయని కమిటీ వెల్లడించింది.

# 'ఊరుకునే ప్రసక్తే లేదు'...

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన బంజారా హిల్స్‌లో రూ.50 కోట్లు, రూ.60 కోట్లు, రూ.100 కోట్ల విలువైన భూములను కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూములను రిజిస్టర్ చేయడానికి జీవో నెం.58, 59 తీసుకొచ్చారని గుర్తు చేశారు. 'వాటిని రిజిస్టర్ చేయడానికి జీవో నెం.58, 59 తీసుకొచ్చారు కదరా నాలిలిలి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పేదల జీవితాలతో చెలగాటమాడితే ఏం రాదని.. రేవంత్ ప్రభుత్వం పేదల జీవితాలతో ఆడుకుంటోందని వారి శాపం తప్పక తగులుతుందని ఈటల హెచ్చరించారు. లంచాలు ఇవ్వకపోతే ఇళ్లను గద్దల్లా వాలి కూల్చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా నిరుపేదల విషయంలో ప్రభుత్వం పిచ్చి వేషాలు మానేయాలని, లేకపోతే భారీ ఉద్యమాన్ని చేపడతామని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. ఈ కూల్చివేతలు పేదల హక్కులను ఉల్లంఘించడమేనని వెంటనే వాటిని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హైడ్రా కూల్చివేతలు ఉద్రిక్తం.. : నగర పరిధిలోని మాదాపూర్ సున్నం చెరువులో హైడ్రా ఆక్రమణల తొలగింపు చేపట్టింది. ఈ కూల్చివేతలను స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అడ్డుకున్నారు. హైడ్రా కూల్చివేతలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వాటిని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మొత్తం 32 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సున్నం చెరువులో భారీ ఎత్తున ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను హైడ్రా కూల్చివేసింది. అంతేకాకుండా చెరువు సమీపంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బోరు మోటార్లను తొలగించారు. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించవద్దని హైడ్రా హెచ్చరించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను కూడా సీజ్ చేశారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జోక్యం చేసుకుని కూల్చివేతలను అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కూల్చివేతలను నిలిపివేయాలని ఆయన అధికారులను కోరారు.

# వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు..?

మొదటి పేజీ తరువాయి



అనంతరం మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. 'అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో ఫార్మా కంపెనీలో మొత్తం 140 మంది పని చేస్తున్నట్లు తెలుస్తున్నది. నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది.

8 మంది మృతి చెందగా, దాదాపు 26 మందిని పలు ఆసుపత్రులకు తరలించారు. మిగతావారి పరిస్థితి తెలియరావడం లేదు. ఎంతమంది బయటికి రాగలిగారు అనేది అర్థం కాని పరిస్థితి. కుటుంబసభ్యులు వచ్చి ఆందోళన చెందుతున్నారు. తమవారి జాడ చెప్పాలని అధికారులను వేడుకుంటున్నారు. కుటుంబ సభ్యులకు వివరాలు తెలిపే ప్రయత్నం చేయాలని కలెక్టర్, ఎస్పీ గారిని కలిసి చెప్పాను.' అని అన్నారు.

'ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ పని చేస్తున్నారు. వారి కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ప్రమాదం జరిగి 5 గంటలు గడుస్తున్నా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కంట్రోల్ రూమ్ పెట్టాలని, కామన్ ఫోన్ నెంబర్ పెట్టాలని అధికారులకు సూచించాను. ప్రమాదం జరిగి 5 గంటలు అవుతున్నది. ఏం చేస్తున్నరు? వివరాలు తెలియక కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నరు? ప్రమాదంలో చిక్కుకున్న వారి జాడ వెతికేందుకు ఎన్డీఆర్ఎఫ్ అద్భుతంగా పని చేస్తున్నది. కానీ ఇర్రెస్పాన్సిబుల్‌గా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పని చేస్తున్నది. ప్రత్యేక అధికారులను పెట్టుకోండి, అటెండెన్స్ లిస్ట్ పెట్టుకోండి.' అని మాజీ మంత్రి అధికారులకు సూచించారు.

'డ్యూటీలో ఎంత మంది ఉన్నరు అంటే కలెక్టర్ ఒక లెక్క, ఎస్పీ ఒక లెక్క చెబుతున్నారు. 5 గంటల నుంచి ఏ వివరాలు లేవు. బాధ్యతారాహిత్యంగా పని చేస్తున్నది ఈ ప్రభుత్వం. అసలు కార్మిక శాఖ, ప్రభుత్వం ఏం చేస్తున్నది. ఇక్కడకు వచ్చే కుటుంబసభ్యులు ఎవరిని కలవాలో చెప్పండి. హ్యాండ్ మైక్ పెట్టుకుని గైడ్ చేసే బాధ్యత లేదా..? గాయపడ్డ వారిని ప్రైమరీ కేర్ ఆసుపత్రుల్లో జాయిన్ చేస్తున్నారు. 30 శాతం కాలితే డేంజర్, కార్పొరేట్ ఆసుపత్రులకు వారిని ఎందుకు పంపడం లేదు..? ఏఐజీ, కేర్, అపోలో ఆసుపత్రులకు పంపండి.


మొదటి గంటలో ట్రీట్మెంట్ అందితే ప్రాణాలు కాపాడవచ్చు. నిర్లక్ష్యంతో గోల్డెన్ అవర్ మిస్ చేస్తున్నారు.' అని హరీశ్‌రావు విమర్శించారు.

'క్షతగాత్రులకు మంచి వైద్యం అందించడంలో ప్రభుత్వం ఫెయిల్. కుటుంబాలకు సమాచారం అందించడంలోనూ ఫెయిల్. ఎంత మంది డ్యూటీలో ఉన్నారో గుర్తించడంలో ఫెయిల్. పారిశ్రామిక వాడలో వరుసగా ఇది మూడో సంఘటన. గతంలో జరిగిన సంఘటనలో ఐదుగురు చనిపోయారు. వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు..? ఏడాదిలో మూడో సంఘటన జరగటం దురదృష్టకరం.

ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. సేఫ్టీ మెజర్స్ తీసుకోవడంలో ఫెయిల్. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలి.

ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే కాపాడే విధంగా చర్యలు రూపొందించాలి. చనిపోయిన కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా, క్షతగాత్రులకు మంచి వైద్యం అందించి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి' అని మాజీ మంత్రి డిమాండ్ చేశారు..

# గ్రూప్ 1 పిటిషన్లపై హైకోర్టులో విచారణ



**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ హైకోర్టు లో నేడు గ్రూప్ 1 పిటిషన్లపై విచారణ జరిగింది. TGPSC నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష సమాధాన పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై నేడు విచారణ జరగగా.. ఈ విచారణ రేపు కూడా కొనసాగనుంది. పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ నంబర్ల మార్పిడి, పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియలో అవకతవకలు వంటి అక్రమాలు జరిగాయని.. పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని పిటిషన్లో కోరారు. అయితే గ్రూప్ 1 నియామక ప్రక్రియను గతంలోనే హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుపుకోడానికి అనుమతించింది.

# నక్సలైట్లను చంపగలరేమో.. నక్సలిజాన్ని చంపలేరు

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు సోమవారం ఆయన ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా పర్యటలో భాగంగా మాట్లాడిన అమిత్ షా నక్సలైట్లు తక్షణమే హింసను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. నక్సలైట్లు గిరిజన బిడ్డలను, పోలీసులను చంపినప్పుడు వారి తరఫున ఎవరూ మాట్లాడలేదు గానీ.. ఇప్పుడు చర్చల కోసం చాలామంది పిలుపునిస్తున్నారని దుయ్యబట్టారు.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారన్నారు. ఆయుధాలు వీడేదాక వారితో చర్చలు ఉండవని అమిత్ షా అన్నారు. ఈ నేపథ్యంలో నారాయణ స్పందించారు.

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు

**న్యూస్ డెస్క్, 30 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా రామచంద్రరావు ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నిక నామినేషన్ గడువు ముగిసే సమయానికి.. ఒకే ఒక్క నామినేషన్ దాఖలు అయ్యింది. అది కూడా రామచంద్రరావుదే. దీంతో అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ విషయాన్ని కేంద్ర అధిష్టానం అధికారింగా ప్రకటించాల్సి ఉంది. ఎంపిక మాత్రం లాంఛనమే.



ముందుగా అనుకున్నట్లే.. రామచంద్రరావు ఎంపికను డిసైడ్ చేయించి.. ఆ తర్వాత ఒకే ఒక్క నామినేషన్ దాఖలు అయ్యే విధంగా చూసింది పార్టీ. మధ్యలో మరో ఎమ్మెల్యే రాజాసింగ్ పోటీకి ప్రయత్నించినా.. ఆ తర్వాత ఆయన విరమించుకుని.. ఏకంగా పార్టీకే రాజీనామా చేశారు.

తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికకు పార్టీ హైకమాండ్ సోమవారం నామినేషన్లు స్వీకరించింది. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఎన్నిక ఇంచార్జులు నామినేషన్లు స్వీకరించారు. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ దాఖలకు గడువు ముగిసింది. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచందర్ రావు ఒక్కరే అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేశారు. రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలకు గడువు ముగిసే సమయానికి రామచందర్ రావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక లాంఛనమైంది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు ఎన్నిక ఏకగ్రీవమైంది. అధికారక ప్రకటన ఒక్కటే ఉంది. ఎన్నిక షెడ్యూల్ ప్రకారం.. 2025, జూలై 1న రాష్ట్ర నూతన అధ్యక్షుడి పేరును పార్టీ అధిష్టానం ప్రకటించనుంది. బీజేపీ ఫైర్ బ్రాండ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేసేందుకు పార్టీ ఆఫీస్?కు వచ్చారు.

నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన నామినేషన్ దాఖలు చేయలేదు. పార్టీ హైకమాండ్ ముందుగానే రామచందర్?ను తదుపరి పార్టీ చీఫ్?గా ఎన్నిక చేయాలని డిసైడ్ కావడంతో ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఇతర నేతలు ఎవరు నామినేషన్ వేయకుండా ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించారు. బీజేపీ అధ్యక్ష ఎన్నిక రేసులో మొదటి నుంచి ముందు వరుసలో ఉన్న ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ చివర్లో రేసు నైదొలిగారు.

కేంద్ర నాయకత్వంతో రామచందర్ రావు వైపు మొగ్గు చూపడంతో వీరు అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో అధ్యక్ష పదవిపై పెట్టుకున్న వీరి ఆశలు అడియాశలు అయ్యాయి. మరోవైపు.. రామచందర్ ఎన్నిక పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏకంగా బీజేపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రస్తుత తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డికి రాజీనామా లేఖను అందజేశారు. మీకో దండం.. మీ పార్టీకో దండం అంటూ తీవ్ర అసహనంతో పార్టీకి గుడ్ బై చెప్పారు.

# నేడు ఎల్ హెచ్‌పిఎస్ ఆవిర్భావ సభ




**ఖమ్మం టౌన్, 30 జూన్ (కెరటం న్యూస్):** లంబాడి హక్కుల పోరాట సమితి నంగారా బేరి ( ఎల్ హెచ్ పి ఎస్ ) ఆవిర్భావ దినోత్సవ సభ జూలై 1వ తేదీన ఖమ్మం లో నీ కిమ్స్ ఆస్పత్రి సమీపం లో గల సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోతు బద్రు నాయక్ , వీరానారీ మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి , బహుజన జేఏసీ చైర్మన్ షేక్. నజీ మా , అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అఖిల్ , ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కో కన్వీనర్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన లంబాడీల అభివృద్ధి అభ్యున్నతిను కాంక్షిస్తూ వారి హక్కుల సాధనకు ఒక వేదికగా లంబాడి హక్కుల పోరాట సమితి నంగా రాబేరి ( ఎల్ హెచ్ పి ఎస్ ) 1997 జులై ఒకటవ తేదీన ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ మహాజన ఉద్యమ నిర్మాత, సామాజిక ఉద్యమ సూర్యుడు మారోజు వీరన్న సూచన సలహాల నేపద్యంలో ఆవిర్భవించిన ఈ సంఘం ఇప్పటికీ 28 వసంతాలు పూర్తి చేసుకొని 29వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా సభను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. లంబాడి హక్కుల పోరాట సమితి బి నంగారా బేరి ఉద్యమ ఫలితంగానే తండాలను గ్రామ పంచాయితీలు మార్పు చేయడం జరిగిందని వెల్లడించారు. జూలై 1వ తేదీన ఉదయం 10 గంటలకు జరిగే ఈ సభకు ముందూ ఆర్ అండ్ బీ పూలే చౌక్ లో సంఘం జెండా ఆవిష్కరణ , కేక్ కటింగ్ , ర్యాలీ ఉంటాయన్నారు. సభ లో బహుజనులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి కిమ్స్ ఆస్పత్రి సమీపంలోని సంఘం కార్యాల యం వరకు జరిగే ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# గోదావరి సర్కిల్ ఎస్ ఈ గా 'ఎలగందుల'

## అభినందనలు తెలిపిన ఉద్యోగులు



**ఖమ్మం బ్యూరో, 30 జూన్ (కెరటం న్యూస్):** కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్, కేంద్ర జల సంఘం, హైదరాబాద్ పరిధిలో గోదావరి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ గా ఎలగంధుల వెంకటేశ్వర్లు గుప్తా పదోన్నతి పొందిన సందర్భంగా అయన కార్యాలయ సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో, భవిష్యత్తు కార్యాచరణలో ఎలగందుల అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని మనసారా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతకుముందు ఆయన ఎగువ గోదావరి డివిజన్, దిగువ గోదావరి డివిసన్, కృష్ణా-గోదావరి బేసిన్ సంస్థ, కేంద్ర జల కమిషన్, హైదరాబాద్‌లో కార్యనిర్వహణ ఇంజినీర్‌గా పనిచేసిన ఎలగంధుల వెంకటేశ్వర్లును సూపరింటెండింగ్ ఇంజినీర్, గోదావరి సర్కిల్, కృష్ణా-గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్, కేంద్ర జల సంఘం, హైదరాబాద్ ఎస్ ఈ గా నియమించడంతొ సిబ్బంది అభినందనలు తెలిపారు.



# ఎంపీ వద్దిరాజు, దాస్యంలకు సత్కారం



**హైదరాబాద్ బ్యూరో, 30 జూన్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను హన్మకొండ జిల్లా కడిపికొండ ముదిరాజ్ సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు.ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యాన కడిపికొండకు చెందిన ముదిరాజ్ ప్రముఖులు సుధాకర్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, కుమారస్వామి, సురేందర్, శ్రీనివాస్, నవీన్ కుమార్ తదితరులు ఎంపీ రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సాయమందించాలని కోరుతూ వినతిపత్రమిచ్చారు.ఈ సందర్భంగా వారు ఎంపీ వద్దిరాజును శాలువాతో సత్కరించారు,ఆ తర్వాత వినయ్ భాస్కర్ ను ఎంపీ రవిచంద్ర శాలువా కప్పి సన్మానించారు.

# తెలంగాణ ఉద్యమకారుల శాంతియుత దీక్ష విజయవంతం



**ఖమ్మం టౌన్, 30 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కేంద్రం లో కొత్త బస్టాండ్ ఎదురుగ సోమవారం నాడు ఒక్కరోజు శాంతియుత దీక్ష ను నిర్వహించడం జరిగింది . ఈ దీక్ష కార్యక్రమాన్ని సీనియర్ ఉద్యమకారుడు అర్వపల్లి విద్యాసాగర్ , సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగు నరసింహారావు లు దీక్ష లో కూర్చున్న ఉద్యమకారులకు పూల దండలు వేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డా" కే.వి.కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కొన్ని హామీలను తమ మానిఫెస్టో లో ఆరు గ్యారంటీల పథకం లో ఆరో గ్యారంటీ గా ప్రతి తెలంగాణ ఉద్యమ కారుడి కి 250 చ: గ: స్థలాన్ని , గృహ నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలను , అమరవీరుల కుటుంబాలకి 25,000 రూపాయల పెన్షన్ సౌకర్యం నీ ఇస్తామని పొందుపరచడం జరిగినది కానీ అమలు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు . తెలంగాణ ఉద్యమకారుల జీవితాలు తెలంగాణ ఉద్యమం వల్ల సర్వనాశనం అయ్యాయి . ఇక నైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేస్తారా లేదా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో మా ఉద్యమకారుల తడాకా ఏంటో చూపించమంటారా అని హెచ్చరించారు . ఈ దీక్షకి సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగు నరసింహారావు , ఏ.ఐ.ఎస్.ఆఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇటిక్యాల రామకృష్ణ సంఘీభావాన్ని ప్రకటించారు . ఈ దీక్ష కార్యక్రమాన్ని పొలిటికల్ జేఏసీ మాజీ ఖమ్మం జిల్లా కన్వీనర్ కూరపాటి రంగరాజు నిమ్మరసం ఇచ్చి విరమించారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం ఉమ్మడి జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య , అర్వపల్లి విద్యాసాగర్ , బచ్చుల పద్మా చారి , జడల వెంకటేశ్వరావు , గుండ్లపల్లి శేషగిరి , లింగనబోయిన సతీష్ , మట్టా దుర్గా ప్రసాద్ రెడ్డి , జ్వాల నరసింహ రావు , షేక్ అబ్బాస్ , కొండ్రు రజనీకాంత్ , ఎస్.డి. బురాన్ , ఆసిఫ్ , షేక్ నాగులు మీరా , భూక్యా శ్రీనివాస్ నాయక్ , పాలకుర్తి కృష్ణ , భట్టు రాజేందర్ నాయక్ , పెళ్ళూరు విజయ్ కుమార్ , రాచమల్ల ఉమయదవ్ , రెడ్డబోయిన వరలక్ష్మి , కొరివి ధనలక్ష్మి , రమాదేవి , మేరీ , గ్లోరి , అల్లిక సంతోష్ యాదవ్ , గాలి రాము గౌడ్ , ఇనుపనూరి శ్రీను , దొడ్డ శ్రీనివాస్ రెడ్డి , కామని అనంత లక్మి , ధనలక్మి , స్వరూప రెడ్డి , పద్మ , యక లక్మీ , అమరుడు వేణు గోపాల్ తండ్రి బాబు, షకీల్, వి.సుందరావు , అంకాలు, రవి, సైదా, మంద వెంకటేశ్వర్లు, గాయకుడు రాము, తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ పేరిట అక్రమంగా రక్తము అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**ఖమ్మం టౌన్, 30 జూన్ (కెరటం న్యూస్):** ఆసుపత్రుల్లో ఆపద వచ్చిందంటే రక్తం కావాలి అంటే ఎన్నో వ్యాయాప్రాయాసాలకు ఓర్చి మిత్రులు బంధువులు రిలేషన్స్ ఎవరున్న ఎక్కడున్నా ఓ ప్రాణాన్ని కాపాడుకోవడం కోసం రక్తం కోసం తహతలాడిపోతాం అలాంటి రక్తాన్ని కేవలం డబ్బు సంపాదన కోసమే వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి ఖమ్మం టూ టౌన్ అధ్యక్షుడు ధనియాకుల వెంకటనారాయణ యాదవ్ వైద్యాధికారులను డిమాండ్ చేశారు . సోమవారం ఖమ్మం నగరంలో ఓ బ్లడ్ బ్యాంకులో 2000 బ్యాగులు ఉన్నప్పటికీ కనీసం రక్తం కావాలంటే మళ్ళీ డోనర్లను సంప్రదించాలి అంటూ వైద్యాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేయగా అక్రమంగా ఉంచిన 2000 శాంపిల్స్ బ్లడ్ ప్లేట్లెట్స్ ను వైద్యాధికారులు సీజ్ చేయడం అభినందనీయమన్నారు . ఖమ్మం నగరంలోని బ్లడ్ బ్యాంకులను ఆసరా చేసుకుని కొంతమంది అక్రమ సంపాదన మార్గంగా ఎంచుకొని ప్రాణాలు పోతున్నా కూడా సంబంధిత రక్తం గ్రూపులు ఉన్నప్పటికీ కూడా ఎవరికి అందజేయడం లేదని అలాంటి బ్లడ్ బ్యాంకులపై చర్యలు తీసుకొని వాటిని వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు . రోజుకు నిత్యం వివిధ రకాలుగా ఎంతోమంది వాహన ప్రమాదాలకి గురై రక్తం కోసం నిత్యం తిరుగుతూనే ఉన్న వారి బాధలను చూసి కూడా కనీసం కనికరించిన బ్లడ్ బ్యాంకులు అక్రమ సంపాదన మార్గంగా ఎంచుకొని రక్తాన్ని అమ్ముకోవడం దుర్మార్గం అన్నారు . వెంటనే వైద్యాధికారులు ఖమ్మంలో ఉన్న ప్రతి బ్లడ్ బ్యాంకు ను సందర్శించి రక్తం అవసరం ఉన్నవారికి వెంటనే రక్తం ఇచ్చే విధంగా తోడ్పాటు అందించాలని అదనంగా ఉంచిన బ్లడ్ శాంపిల్స్ ప్లాస్మా ప్లేట్లెట్స్ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# యర్రా శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శించిన రేణుకా చౌదరి



**ఖమ్మం టౌన్, 30 జూన్ (కెరటం న్యూస్):** అమరజీవి కామ్రేడ్ యర్రా శ్రీకాంత్ నిరంతరం పేద ప్రజల సమస్యల కోసం సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి అని రాజ్యసభ సభ్యురాలు ఎంపీ శ్రీమతి రేణుకా చౌదరి అన్నారు. ఈరోజు మధ్యాహ్నం శ్రీమతి రేణుకా చౌదరి యర్రా శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శించారు. రేణుక చౌదరి యర్రా శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకి సానుభూతిని తెలియజేశారు. యర్రా శ్రీకాంత్ గారి సతీమణి యర్రా సుకన్య తో మాట్లాడారు .ఈ సందర్భంగా రేణుకా చౌదరి మాట్లాడుతూ యర్రా శ్రీకాంత్ నిత్యం నిరంతరం పేద ప్రజల సమస్యలపై ముఖ్యంగా ఖమ్మం పట్టణ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేవాడని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధుల దగ్గరికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు చేసేవాడని అలాంటి కమ్యూనిస్టు నాయకుడు అకాల మరణం చెందడం విచారకరమని బాధాకరమని చిన్న వయసులోనే మరణించడం ప్రజలకు తీరనిలోటని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజేనేపల్లి శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం డివిజన్ నాయకులు 31 వ డివిజన్ కార్పొరేటర్ యర్రా గోపి, సిఐటియు జిల్లా నాయకులు యర్రా రమేష్ ,సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ సైదులు, యర్రా రంజిత్, యర్రా జ్ఞానేష్ ,షేక్ హిమామ్, ఖమ్మం వ్యవసాయం మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్, కాంగ్రెస్ నాయకులు షేక్ ముస్తఫా, 17వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# రసాయన పరిశ్రమలో కార్మికుల మరణం

## ఎంపీ వద్దిరాజు సంతాపం



**హైదరాబాద్ బ్యూరో, 30 జూన్ (కెరటం న్యూస్):** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని ఒక రసాయన కర్మాగారంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల సంఖ్య ఇంకా పెరుగుతుండవచ్చనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలపై విచారణ జరిపించాలని, ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీ రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఎంపీ వద్దిరాజు సూచించారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఎంపీ రవిచంద్ర తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

# ఎంపీ వద్దిరాజును కలిసిన గొల్లచర్ల ముదిరాజ్ ప్రముఖులు



**హైదరాబాద్ బ్యూరో, 30 జూన్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్లకు చెందిన ముదిరాజ్ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఎంపీ రవిచంద్రను సోమవారం సాయంత్రం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు సంతోష్,మల్లయ్య, బలరాం, శ్రీనివాస్, ప్రసాద్, సురేష్,ఉప్పయ్యలు కలిసి తమ స్వగ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మాణానికి సాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

# పదవి విరమణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ తాతా మధు, సండ్ర



**ఖమ్మం బ్యూరో, 30 జూన్ (కెరటం న్యూస్):** సోమవారం ఖమ్మం జిల్లా పి ఆర్ టి యు భవనం నందు ఏర్పాటు చేసిన యలమద్ది వెంకటేశ్వర రావు యొక్క పదవి విరమణ కార్యక్రమం నకు ముఖ్య అతిథులుగా హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ, ఒక గవర్నమెంట్ పాఠశాలలో 900 మంది విద్యార్థుల వరకు ఉండడమనేది మరియు దాన్ని ఆ విధంగా నిలుపుతున్న ఘనత ఉపాధ్యాయులకు చెందుతుంది, ఎన్నారై అసోసియేషన్ మాజీ అధ్యక్షులుగా మరియు ఎన్నో విధాలుగా ప్రజలకు అందుబాటులో ఉండి, సేవ చేస్తున్నటువంటి అభ్యునత వ్యక్తి వెంకటేశ్వర రావు, తన పదవి విరమణ తర్వాత కూడా, ప్రజలతో మమేకమై సేవ చేస్తూ ఉండాలని కోరుతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.



